దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కలెక్టరేట్/విద్యానగర్, ఫిబ్రవరి 3: జిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని, ఇందులో భాగంగా గణతంత్ర వేడుకల్లో వారిని సత్కరించినట్లు పేర్కొన్నారు. పథకాల అమలులో దివ్యాంగులకు ఇబ్బందులు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో ప్రతి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దివ్యాంగులపై జరిగే దాడి ఘటనల్లో సరైన న్యాయం అందేలా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు తగిన ఆదేశాలు జారీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక గది ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని, అవసరమైన పుస్తకాలు అందించాలని గ్రంథాలయ కమిటీ సభ్యులను కోరారు. సదరం సర్టిఫికెట్ల జారీలో దివ్యాంగులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. స్లాట్ బుకింగ్ కోసం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేసే మీసేవ కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సదరం సర్టిఫికెట్లు అనర్హులకు అందకుండా వైకల్య నిర్ధారణ పరీక్షలను సీసీ కెమెరాల ద్వారా రికార్డు చేయించాలన్నారు. సమావేశంలో డీడబ్ల్యూవో సరస్వతి, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డా.వీరారెడ్డి, డీఆర్డీవో శ్రీలత, జడ్పీ సీఈవో పవన్‌కుమార్, ఎల్డీఎం ఆంజనేయులు, మెప్మా పీడీ రవీందర్, సీఐ సరిలాల్, దివ్యాంగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీనివాస్, దివ్యాంగుల సంఘం జిల్లా నాయకుడు జక్కం సంపత్, తదితరులు పాల్గొన్నారు.

రేపు హరీశ్ రావు రాక

తిమ్మాపూర్/శంకరపట్నం/ గన్నేరువరం, ఫిబ్రవరి3: ఈ నెల 5న మానకొండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో జరుగనున్నట్లు పార్టీ తిమ్మాపూర్, గన్నేరువరం మండలాధ్యక్షులు రావుల రమేశ్, గంప వెంకన్న, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, శంకరపట్నం జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అలుగునూర్‌లోని శ్రీ లక్ష్మీనరసింహ గార్డెన్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అలాగే మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పాల్గొననున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పల్స్ పోలియో పై శిక్షణ

విద్యానగర్, ఫిబ్రవరి 3: జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు శనివారం ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వైవ్‌లెన్స్ అధికారి డాక్టర్ అతుల్ నిగమే శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ లలితా దేవి మాట్లాడుతూ, జిల్లాలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు జిల్లాలో 0-5 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు.

దాతల ఔదార్యం

రామడుగు (చొప్పదండి), ఫిబ్రవరి 3: రామడుగు మండలం వెంకట్రావ్‌పల్లి గ్రామంలో తల్లిదండ్రుల మృతితో దైవాల అక్షర, కృషిత అనే ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారిన విషయం తెలిసిందే. వారి దీనస్థితిని తెలుసుకున్న దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అండగా నిలిచి ఔదార్యాన్ని చాటుకుంటున్నారు. శనివారం కిష్టంపల్లి గ్రామానికి చెందిన మున్నూరు కాపు యువత ఆధ్వర్యంలో రూ.10 వేలు, శాలివాహన యువత ఆధ్వర్యంలో రూ.5 వేలు, మిట్ట బ్రదర్స్ రూ. 5 వేలు, మంత్లీ డోనర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ.3 వేలు, చిట్టెడి మధుకర్‌రెడ్డి రూ.2500, కొల్లూరి రాజు, దర్శనాల రాజు, భీమ హరీశ్ రూ.1000 చొప్పున అందజేశారు.


కరీంనగర్‌రూరల్: చెర్లభూత్కూర్‌లో తాజా మాజీ పాలక వర్గాన్ని సన్మానించిన గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు

గంగాధర: బూరుగుపల్లి తాజామాజీ సర్పంచ్ రమ్యను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

గంగాధర, ఫిబ్రవరి 3: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొనియాడారు. ఐదేండ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న నియోజకవర్గంలోని ఆరు మండలాల సర్పంచులకు శనివారం మధురానగర్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని మాజీ ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఇక్కడ ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 3: చెర్లభూత్కూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో తాజా మాజీ పాలకవర్గ సభ్యులను శనివారం గ్రామస్తులు సన్మానించారు. ప్రత్యేకాధికారి సంపత్‌కుమార్, మాజీ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఉపసర్పంచ్ చిట్కూరి శేఖర్, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి, ఫిబ్రవరి 3: సుందరగిరి గ్రామపంచాయతీ ఆవరణలో ఐదేండ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న పంచాయతీ పాలకవర్గానికి సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్ ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్ హాజరై పాలకవర్గాన్ని సన్మానించారు. గ్రామాభివృద్ధిలో వారి కృషిని కొనియాడారు. అనంతరం సర్పంచ్ జీపీ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్‌తోపాటు ఎంపీటీసీ మెడబోయిన తిరుపతి, తాజా మాజీ ఉప సర్పంచ్ జంగా శ్రీనివాస్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు కంది శంకర్, బస్వరాజుల వెంకవ్వ, కక్కెర్ల సంజీవ్, జీలా శ్రీకాంత్ ,ఆకుల పద్మ, కంది తిరుపతిరెడ్డి, మాతంగి సుజాత, గంధం సుమాంజలి, బొల్లి సుమలత, వంతడ్పుల దిలీప్ కుమార్, పెసరి సుజాత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సమోసా తింటూ.. ఛాయ్ తాగుతూ...

టీ తాగుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, నాయకులు

- ప్రజల బాగోగులు అడిగి తెలుసుకున్న మాజీ ఎంపీ

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 3: పట్టణంలో కృతజ్ఞత సభ కార్యక్రమానికి హాజరై వెళ్లే క్రమంలో శనివారం కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అంబేద్కర్ చౌరస్తాలోని సిటీ ప్యాలెస్ టీ పాయింట్ వద్ద వాహనాన్ని నిలిపి కొంతసేపు ఆగారు. అక్కడ మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి సమోసా తింటూ, ఛాయ్ తాగుతూ హోటల్ వద్దకు వచ్చిన ప్రజల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. గతంలో కూడా పలుమార్లు ఇక్కడ ఆగి ఛాయ్ తాగినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కేడీసీసీబీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సామాజికవేత్త రవీందర్‌రావు, పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు లావణ్య, రమాదేవి, సుశీల, శ్రీదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

- మేయర్ యాదగిరి సునీల్‌రావు
- 14వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

కార్పొరేషన్, ఫిబ్రవరి 3: నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు బల్దియా పాలకవర్గం కృషి చేస్తున్నదని మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. స్థానిక 14వ డివిజన్‌లో శనివారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో భారీగా నిధులు రావడంతో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలో ప్రధాన సమస్యలన్నింటినీ పరిష్కరించినట్లు తెలిపారు. శివారు డివిజన్ల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి పనులు చేయించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నగరాభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్, నాయకులు, ప్రజలు, బల్దియా అధికారులు పాల్గొన్నారు.

5 నుంచి ఈవీఎంల తనిఖీలు

కలెక్టరేట్, ఫిబ్రవరి 3: ఈనెల 5 నుంచి ఈవీఎం, వీవీప్యాట్‌ల మొదటి స్థాయి తనిఖీలు చేపట్టనున్నట్లు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. నగరంలోని ఎస్సారార్ కళాశాలలో ఈవీఎం, వీవీప్యాట్లు భద్రపరిచే గదులను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కరీంనగర్, మానకొండూర్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీప్యాట్లను గోదాముల్లోకి మార్చనున్నట్లు స్పష్టం చేశారు. ఈవీఎంల గోదాంలోనే ఫస్ట్ లెవల్ చెకింగ్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో పవన్‌కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు కళ్యాడపు ఆగయ్య, మడుపు మోహన్, బండ రమణారెడ్డి, సత్తినేని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'జాతర'ను గొప్పగా జరుపుకొందాం

జమ్మికుంట, ఫిబ్రవరి 3: సమ్మక్క జాతరను గొప్పగా జరుపుకొందామని, భక్తుల కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు తెలిపారు. శనివారం ఆయన మున్సిపల్ పరిధిలోని కేశవాపూర్ సమ్మక్క-సారలమ్మ గద్దెలను సందర్శించారు. జాతర సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్లను వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, ఎంపీపీ మమతతో కలిసి చైర్మన్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జాతరకు వేల మంది భక్తులు ఇక్కడికి రానున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ కౌన్సిలర్లు నరేశ్, భాస్కర్, రమేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ తిరుపతిరావు, జాతర కమిటీ శాశ్వత సభ్యులు, తదితరులున్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319429-All

CHANGE OF NAME

★I, NAREDDY SUVARNA, D/o. Ram Reddy, R/o. 2-10-1090, Jyothi Nagar, Karimnagar, TS. Changed My Name as MUDUGANTI SUVARNA REDDY, W/o. Manohar Reddy.
NT-319691

★I, ENUKONDA SRINIVASA REDDY, S/o. Venkata Reddy, R/o. 1-4/1, Mallapur, Thimmapur, Karimnagar, TS. Changed My Name as ENUKONDA SRINIVAS REDDY, S/o. Venkata Reddy.
NT-319691

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

టెర్రరిస్టులకు, కాంగ్రెస్ నేతలకు తేడా ఏముంది?

- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్

విద్యానగర్, ఫిబ్రవరి 3 : భారతదేశాన్ని విభజించాలని కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలకు, టెర్రరిస్టులకు తేడా ఏముందని ప్రశ్నించారు. శనివారం ఆయన కరీంనగర్ పరిధిలోని తీగలగుట్టపల్లి కోదండరామాలయం సమీపంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను, జిల్లా జైలులో అంబులెన్స్, వైద్య పరికరాలను ప్రారంభించారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడారు. 'కశ్మీర్ ప్రత్యేక దేశం కావాలని టెర్రరిస్టులు, పంజాబ్‌ను ఖలిస్థాన్ దేశంగా ప్రకటించాలని ఉగ్రవాదులు చెబుతున్నారు.. ఇప్పుడు కాంగ్రెస్ ఎంపీ సురేశ్ భారత్‌ను దక్షిణ దేశంగా, ఉత్తర దేశంగా విభజించాలని అంటున్నారు.. మరి వాళ్లకు, వీళ్లకు తేడా ఏమిటి?' అని ప్రశ్నించారు. గతంలో రాహుల్ గాంధీ సైతం భారతీయుడిగా చెప్పుకొనేందుకు సిగ్గు పడుతున్నానని దేశాన్ని కించపర్చారని గుర్తు చేశారు. ఆయన బావ రాబర్ట్ వాద్రా సైతం భారత్ దుర్భర దేశమని భారతీయులను కించపర్చారని మండిపడ్డారు. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే నేతలపై దేశ ద్రోహం కేసు పెట్టాలని కోరారు. అద్వానీకి భారతరత్న ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేసిన బండి సంజయ్.. బీజేపీ కార్యకర్తగా ఉన్నందుకు గర్వపడుతున్నామని, తమకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నామని చెప్పారు. ఆయన వెంట బీజేపీ నాయకులు గుగ్గిళ్లపు రమేశ్, బండ రమణారెడ్డి, ఎన్నం ప్రకాశ్, లడ్డు ముందాడా, లోకేశ్, కల్యాణ్ తదితరులున్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 3: బ్యాంకింగ్ రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాల కల్పనకు హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించింది. వివిధ కళాశాలల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు జాబ్ మేళాకు హాజరు కాగా, ఆక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, యెస్ బ్యాంక్, డెలివరీ తదితర సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూ చేశారు. మొత్తం 80 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డా. పీ ఇందిరాదేవి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహమూర్తి, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ ఎస్ మధు, ఐక్యూ ఏసీకో ఆర్డినేటర్ డా. పీ దినకర్, అకాడమిక్ కో ఆర్డినేటర్ డా. జీ శ్రీనివాస్, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన

తిమ్మాపూర్ రూరల్, ఫిబ్రవరి3: మొగిలిపాలెంలో వరి పంటల్లో సస్యరక్షణ చర్యలపై కేవీకే, జమ్మికుంట ఆధ్వర్యంలో శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఎన్ వెంకటేశ్వర రావు హాజరై, వరి పంటల్లో ఆశించే తెగుళ్లు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. శాస్త్రవేత్త ఎన్ వెంకటేశ్వర్, దేశి ప్రోగ్రాం కోఆర్డినేటర్ రామచంద్రరావు, ఏవో సురేందర్, ఏఈవో ప్రవీణ్, ఆత్మ ఏపీఎం అర్చన పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సామూహిక అన్నప్రాసన

గన్నేరువరం, ఫిబ్రవరి3: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఏసీడీపీవో అరవింద ఆరు నెలల పిల్లలకు అన్నప్రాసన చేశారు. పిల్లల బరువు, ఎత్తు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 3: చెంజర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని వితరణ చేశారు. సంస్థ కార్యదర్శి గోగూరి శ్రీధర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. వార్షిక పరీక్షల్లో 9.8, అపైన జీపీఏ సాధించే విద్యార్థులకు తమ సంస్థ తరఫున రూ.2016 చొప్పున పారితోషికం అందజేయనున్నట్లు సాగర్ ప్రకటించారు. హెచ్ఎం ఆఫీస్ క్రేశి, ఉపాధ్యాయులు పద్మజా, వనమతి, లక్ష్మణ్ రావు, శ్రీలత పాల్గొన్నారు.

ఉద్యోగాలకు కిట్స్ విద్యార్థులు ఎంపిక

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 3: సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న 20 మంది విద్యార్థులు ఏజీఐగ్లాస్ ప్యాక్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ శనివారం తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య, కళాశాల ఉపాధి శిక్షణ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎంవీ సతీశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

విద్యానగర్, ఫిబ్రవరి 3: అంతర్జాతీయ క్యాన్సర్ డేను పురస్కరించుకొని ఆదివారం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లలితాదేవి తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 56 సర్వైకల్, 89 రొమ్ము క్యాన్సర్, 61 నోటి క్యాన్సర్ కేసులను గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో కీమోథెరపీ డే కేర్ కేంద్రం అందుబాటులో ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా జైలును సందర్శించిన న్యాయమూర్తి

రాంనగర్, ఫిబ్రవరి 3: కరీంనగర్ జిల్లా జైలును శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వెంకటేశ్ సందర్శించారు. జైలులో ఖైదీల యోగక్షేమాలు, భోజన వసతులు, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులోని క్యాంటీన్, దవాఖాన, ములాఖాత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, వంటశాల, జైలు ఇండస్ట్రీల్లో పని తీరు బాగుందని గుర్తించి, అధికారులను అభినందించారు. మహిళా జైలును కూడా సందర్శించి, మహిళా ఖైదీలతో మాట్లాడి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైలులో ప్రస్తుతం బాల నేరస్తులు ఎంత మంది ఉన్నారని తెలుసుకొని, వారికి కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణ అధికారి సమ్మయ్య, జైలర్లు శ్రీనివాస్, రమేశ్, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాట్లు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 3: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలో సమ్మక్క-సారలమ్మ జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. చెక్ డ్యామ్ నుంచి జాతర ప్రదేశం వరకు శనివారం రోడ్డు నిర్మించారు. జాతర కమిటీ సభ్యులు బత్తిని దిలీప్‌గౌడ్, దావు ఎల్లయ్య, కోటేశ్వర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై వివరాల సేకరణ

కొత్తపల్లి, ఫిబ్రవరి 3: చింతకుంట గురుకుల కళాశాలలో ఇటీవల విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై డీసీపీవో శాంత, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ సంపత్ వివరాలు సేకరించారు. జిల్లా సంక్షేమాధికారి ఆదేశాల మేరకు వీరు కళాశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై ప్రిన్సిపాల్, లెక్చరర్స్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కళాశాలలో ప్రస్తుతం విద్యార్థులు లేనందున మరోసారి సందర్శించి పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్ జాస్మిన్ థెరిసా, బాలల పరిరక్షణ పథకం సోషల్ వర్కర్ కవితా దేవి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేసు వర్కర్ సాయికిరణ్, తదితరులున్నారు.

చెకుముకి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మానకొండూర్, ఫిబ్రవరి 3: ఈ నెల 9న హైదరాబాద్‌లో జరిగే చెకుముకి రాష్ట్రస్థాయి పోటీలకు మానకొండూర్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఏ హర్షవర్ధన్, సీహెచ్ శ్రీనివాస్, కే ఆజం ఎంపికైనట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి జీ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పీడీ సంతోష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

కార్పొరేషన్, ఫిబ్రవరి 3: ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం పథకంతో ఆర్థిక ఇబ్బందులు పడుతూ ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల చిత్రపటాలకు జిల్లా ఆటో కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ చౌరస్తాలో శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, ఆటో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మద్దెల రాజేందర్, బండారి సంపత్, నర్సింహ నాయక్, మారం సంపత్, ఉత్తంకుమార్, పురుషోత్తమా చారి పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు

గంగాధర, ఫిబ్రవరి 3: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో శనివారం ప్లాస్టిక్ నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీడీవో మల్హోత్ర, తహసీల్దార్ రమేశ్‌బాబు మాట్లాడుతూ, ఈ నెలాఖరులోగా నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా ఆపివేయాలని దుకాణాదారులకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం గింజల పంపిణీ

జమ్మికుంట, ఫిబ్రవరి3: శ్రీరామనవమిని పురస్కరించుకుని అఖిల భారత హనుమాన్ ప్రచారకుడు రాములుస్వామి ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో రాములోరి కల్యాణం కోసం ధాన్యం గింజలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాములుస్వామి మాట్లాడుతూ.. గింజలను ఒలిచి బియ్యాన్ని తిరిగి శ్రీసీతారాముల కల్యాణానికి అప్పగించాలని భక్తులకు సూచించారు. వాటితో తలంబ్రాలు తయారు చేస్తామని తెలిపారు. అంతకు ముందు రామాలయంలో ఆలయ అర్చకుడు వెంకటేశ్వరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ ఇంద్రారెడ్డి, తిరుపతయ్య, పాపయ్య, రవీందర్, కొమురారెడ్డి, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, రమేశ్, సత్యనారాయణ తదితరులున్నారు.

డిమాండ్లను పరిష్కరించాలని వినతి

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి3: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అందించడంతో పాటు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్ ఎస్ సమ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 16న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొంటారని తెలిపారు. ఇక్కడ అధ్యక్షుడు ఎండీ అజ్జు, ఉపాధ్యక్షులు సరోజన, సమ్మక్క, క్రాంతికుమార్, మొగిలి, కోశాధికారి రాజేశ్వరి, ప్రచార కార్యదర్శి బొరగల కుమార్‌రాజ్, సభ్యులు కుమార్, సులోచన, భాగ్య, నర్సయ్య, సుశీల, సతీశ్, రాజు తదితరులున్నారు.

కలెక్టర్‌కు వినతి

కార్పొరేషన్, ఫిబ్రవరి 3: జిల్లా కేంద్రంలోని వారధి సొసైటీని రద్దు చేయాలని, పదేళ్లుగా సొసైటీ కార్యదర్శిగా ఉంటూ అవినీతికి పాల్పడుతున్న ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు వైద్యుల అంజన్‌కుమార్ శనివారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కాంగ్రెస్ నాయకులు బోనాల శ్రీకాంత్, మడుపు మోహన్, అబ్దుల్ రెహమాన్, మోసిన్ ఉన్నారు.

గ్రామాలను సందర్శించిన ప్రత్యేకాధికారులు

చిగురుమామిడి, ఫిబ్రవరి 3: చిగురుమామిడి, రేకొండ, ముదిమాణిక్యం, గాగిరెడ్డిపల్లి, ముల్కనూర్, సుందరగిరి తదితర గ్రామాలను శనివారం ప్రత్యేకాధికారులు సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఈజీఎస్ నర్సరీలు, పారిశుధ్యం తదితర పనులను పరిశీలించారు. ఎంపీడీవో నర్సయ్య, తహసీల్దార్ నరేందర్, ఏవో రంజిత్ కుమార్, మండల పరిషత్ సూపరింటెండెంట్ ఖాజామొయినొద్దీన్, జమునారాణి ఉన్నారు.

కొత్తపల్లి, ఫిబ్రవరి 3: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో పారిశుధ్య పనులను శనివారం ప్రత్యేకాధికారి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అభినవ్, కారోబార్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే హంగామా

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 3: సింగాపూర్ వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో హంగామా చేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎన్ హనుమకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కిట్స్ ప్రొఫెసర్ వీ రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

సైదాపూర్, ఫిబ్రవరి3: బాలల పరిరక్షణ సమాజంలోని అందరి బాధ్యత అని ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బాలల పరిరక్షణ కమిటీ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలల పరిరక్షణకోసం కమిటీలు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో పద్మావతి, ఎస్ఐ ఆరోగ్యం, బాలల పరిరక్షణ అధికారి రమేశ్, అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ కృషితోనే తెలంగాణ సస్యశ్యామలం

కలెక్టరేట్, ఫిబ్రవరి 3: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితోనే స్వరాష్ట్రం సస్యశ్యామలంగా మారిందని ముస్లిం మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ ఇలియాస్ పేర్కొన్నారు. నగరంలోని కార్ఖానాగడ్డలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ ఇస్మాయిల్, సిరాజ్ పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్ల హరిశంకర్, తదితరులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 3 : గోజుర్యూ కరాటే డొ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఇండో నేపాల్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు కరీంనగర్‌లో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ చాంపియన్‌షిప్ పోటీలకు చీఫ్ ఆర్గనైజర్‌గా సురభి వేణుగోపాల్, కో ఆర్గనైజర్స్‌గా సురభి ఇంద్రవేష్, సురభి అన్వేష్ వ్యవహరిస్తుండగా, గోజుర్యూ కరాటే డొ అసోసియేషన్ ఇండియా చీఫ్ ఎల్ నాగేశ్వర్‌రావు, నేపాల్ కరాటే ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ బల్‌రాం మిత్ర, ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా. వీ నరేందర్‌రెడ్డి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, సీనియర్ కరాటే మాస్టర్లు కే వసంత్‌కుమార్, ఈ శ్రీనివాస్, సత్యశంకర్, మొండయ్య, రాజిరెడ్డి, ప్రసన్న, శ్రీనివాస్, చందర్, సంతోష్, కరాటే ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.